

"ఒక పాఠశాల మిషను పొలముగా మారినప్పుడు"

అగాటా–పోలాండ్

అగాటా, దాదాపు 20 ఏళ్లపాటు, వార్సా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలిష్ భాష మరియు లిటరేచర్ బోధించారు. ఆమెకు బోధించడం అంటే చాలా ఇష్టం, కానీ కాలక్రమేణా ఏదో లోపించినట్లు ఆమెకు అనిపించింది. "తరగతుల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండేది, పాఠాలు హడావిడిగా సాగేవి, దాంతో విద్యార్థులకు నిజంగా పాఠాలు అర్థం చేసుకోవడానికి తగినంత సమయం దొరికేది కాదు.నాకు విద్యార్థులతో మరింత లోతైన అనుబంధం కావాలనిపించింది. కేవలం పాఠం చెప్పి వెళ్లిపోవడం మాత్రమే కాకుండా, నా విద్యార్థుల అవసరాలు, వారి ప్రతిభ మరియు వారి కుటుంబాల గురించి నిజంగా తెలుసుకోవాలని నేను కోరుకున్నాను."అని అగాటా అన్నారు.

2018 నాటికి, మార్పు తెచ్చుటకు సమయం ఆసన్నమైందని ఆమెకు అర్థమైంది. అదే సంవత్సరం, కొంతమంది ఎడ్వెంటిస్ట్ తల్లిదండ్రులు ఒక చర్చి ప్రాంగణంలో కిండర్ గార్టెన్ పిల్లల కోసం ఇంగ్లీష్ తరగతులను ప్రారంభించారు. కొన్ని కుటుంబాలతో మొదలైన ఈ కార్యక్రమం, క్రమంగా ఎక్కువ కుటుంబాలకు విస్తరించింది. తమ పిల్లలకు విశ్వాసం, వ్యక్తిగత సంబంధాలు మరియు ఒక లక్ష్యంతో కూడిన ఎడ్వెంటిస్ట్ పాఠశాల అవసరం అని వారు తలంచారు.

ఆ తల్లిదండ్రులు అగాటాను సహాయం చేయమని అడిగారు.

అక్కడ పరిస్థితి అనుకూలంగాలేదు. ఒకే ఒక తరగతి గది ఉంది, మరియు అక్కడ తరగతి నిర్వహించడానికి కావలసిన నిధులు కేవలం మూడు నెలలకు మాత్రమే సరిపోతాయి. ఎడ్వెంటిస్ట్ తల్లిదండ్రుల ఆహ్వానాన్ని అంగీకరించడమంటే, అగాటా తన స్థిరమైన ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదులుకోవడంతో పాటు, తన ఇంటికి చెల్లించాల్సిన అప్పు భరిస్తూ, తన భర్త ఆదాయంపై ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది.

"నేను ఎంతో ప్రార్థించాను. నా జీవితంలో అత్యంత క్లిష్టమైన నిర్ణయాలలో అది ఒకటి," అని ఆమె గుర్తుచేసుకున్నారు.

ఆమె తన భర్తను సలహా అడిగినప్పుడు, ఆయన చాలా సావధానంగా "కేవలం ప్రయత్నించు" అని చెప్పారు.అగాటా విశ్వాసంతో ముందడుగు వేశారు. మూడు నెలలు

గడిచాయి. ఆ తర్వాత మరిన్ని నిధులు సమకూరాయి. "మాకు డబ్బు లేని పరిస్థితి ఒక్క క్షణం కూడా రాలేదు," . "ఆరంభం చాలా కష్టంగా ఉన్నప్పటికీ, దేవుడు దానిని మొదటి నుండే ఆశీర్వదించారు"అని ఆమె చెప్పారు.

అగాటా "ఇది మాకు ఉద్యోగం మాత్రమే కాదు, దీనిని ఒక మిషను పొలముగా చూస్తాము కలిసి పని చేస్తున్నాము " అని ఆమె చెప్పింది. స్కూల్ నందు ఆధ్యాత్మికత అభివృద్ధి చెందునట్లు, వారి సంస్కృతికి తగినట్లు పాఠ్యాంశాలను రూపొందించారు. తత్వశాస్త్రం, ఎడ్వెంటిస్ట్ విద్య తో పాటు , బైబిల్ చదవడానికి కొంత సమయం కేటాయించడం అవసరమని, అగాటా, ఆమె సహచరులు గ్రహించారు. ఇది పిల్లలకు విద్యతో పాటు, శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా, ఆధ్యాత్మికంగా ఎదుగుటకు సహాయపడును. అలాంటి అనిశ్చిత ఆరంభం నుండి "కొంపాస్" రూపుదిద్దుకుంది; ఇది 1 నుండి 8వ తరగతి వరకు పిల్లలకు విద్యనందించే ఒక ఎడ్వెంటిస్ట్ ప్రైమరీ మరియు ప్రీ-స్కూల్. కేవలం కొద్ది సంవత్సరాలలోనే, ప్రైమరీ స్కూల్ లో 50 మంది , ప్రీ-స్కూల్లో 32 మంది విద్యార్థులు చేరారు; తమ ఉద్యోగాన్ని ఒక దైవ పిలుపుగా భావించే ఉపాధ్యాయులు మరియు సిబ్బంది బృందం దీనికి అండగా నిలిచారు.

బహిరంగ విద్యాబోధన ఒక ప్రధానమైన ప్రభావం కలిగియున్నది.. బైబిల్ పాఠాలు తరచుగా ఇంటి లోపల ప్రారంభమై ప్రకృతిలో కొనసాగుతాయి, అక్కడ పిల్లలు చుట్టూరా తాము చూసే మేఘాలు, చెట్లు, నేల మరియు ఆకాశం వంటి వాటితో బైబిలు వచనాలను అన్వయించుకుంటారు.

"పిల్లలు బయట ఉన్నప్పుడు, వారు దేవుని సృష్టిలో ఉంటారు,వారు స్వచ్ఛమైన గాలిని పీలుస్తారు, చురుకుగా కదులుతారు, వారి మెదళ్ళు మెరుగ్గా పనిచేస్తాయి. మరియు ప్రకృతి దేవుడు సృష్టించినదేనని వారు అర్థం చేసుకుంటారు" అని అగాటా అన్నారు.

మాంటెస్సోరి ఆధారిత పద్ధతులు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి స్థాయికి అనుగుణంగా వారికి బోధించడానికి కూడా సహాయపడతాయి. చిన్న తరగతుల విద్యార్థులు అవసరమైనప్పుడు మార్గనిర్దేశం పొందుతూ, తమకు అందుబాటులో ఉన్న వస్తువులతో తమ సొంత మేధాశక్తితో వేగంతో నేర్చుకుంటారు. "కొంపాస్" వద్ద తరగతి గదిని దాటి విద్యార్థుల విశ్వాసం విస్తరించింది. విద్యార్థులు తమ సమాజానికి సేవ చేస్తారు-వృద్ధాప్యంలో ఉన్న పొరుగువారిని సందర్శించడం, చేతితో తయారు చేసిన బైబిల్ వచనాలతో కూడిన కార్డులు పంచడం , మరియు ఒంటరితనంతో బాధపడే వ్యక్తులకు పాటలు పాడి విన్పించడం చేస్తారు. శుక్రవారాలు కూడా భిన్నంగా కనిపిస్తాయి. విద్యార్థులు తోటలలో మరియు క్యాంపస్ చుట్టూ తోట పని చేయడం ,పెయింటింగ్, ఊడ్చడం , తోటలోని ఆకులు, చెత్తను సేకరించడం, కట్టెలు ఏరడం,మరియు నేలలో చల్లే విత్తనాలు దేవుని వాక్యం గురించి పాఠాలుగా మారతాయి.

అందరూ కలిసి క్యాంప్ఫైర్ వేస్తారు. ఇక్కడ ప్రీస్కూలర్లు మరియు పాత విద్యార్థులు కలిసి, మాట్లాడుకుంటారు మరియు కలిసి ఆడుకుంటారు. ఆ విధంగా వారం తరచుగా ముగుస్తుంది.

కాలక్రమేణా, అగాటా మరియు ఆమె సహచరులు పిల్లల్లో మార్పును గమనించారు. "ఇక్కడి వాతావరణం పిల్లలహృదయాలను మారుస్తుంది. వారు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారు. వారి మాటలు ఎవరినైనా బాధపెడతాయోనని 1వ తరగతి విద్యార్థులు కూడా ఆలోచిస్తారు. సానుభూతిని చూపిస్తారు. పరిశుద్ధాత్మ దేవుడు వారిలో పనిచేస్తున్నాడని మాకు తెలుసు. "ఈ సంగతి ఒక రోజు వర్షం వచ్చినప్పుడు స్పష్టమైంది.

ఒకసారి విహారయాత్ర సమయంలో, ఒక్కసారిగా వాతావరణం మారిపోయి పెద్దగా వర్షం కురుస్తున్నప్పుడు అగాటా తీవ్రమైన ఆందోళన చెందుతున్నప్పుడు, 8 సంవత్సరాలున్న ఇద్దరు పిల్లలు– అగాటా కుమార్తె మరియు ఆమె సహవిద్యార్థి వచ్చి " మీరు చింతించకండి, మేము ప్రార్థిస్తాము."అని చెప్పారు.అలాగే వారు చేసారు. వర్షం ఆగిపోయింది."వారికి, ప్రార్థన మొదటి ఎంపిక ".దేవుడు తమ ప్రార్థన వింటాడని వారు నమ్ముతారు–మరియు ఫలితాలను చూస్తారు" అని అగాటా చెప్పారు.

నేడు, అగాటా స్కూల్ ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఆమె ఒకప్పుడు ఆ స్కూల్ లో పనిచేయుటకు సందేహించినా ఆమె, విద్యార్థులకు దగ్గరగా ఉండాలని కోరుకుంది. ఇంకా దేవుని పిలుపుఆమెకు స్పష్టంగా ఉంది.ఇది కేవలం ఒక స్కూల్ మాత్రమే కాదు, ఒక మిషను పొలము కూడా అని ఆమె తరచుగా అంటున్నారు.

"కొంపాస్" లో, పిల్లలు తాము ఎక్కడికి వెళ్లినా క్రీస్తు చూపిన కరుణతో జీవించునట్లు తీర్చిదిద్దబడుతున్నారు. "ఈ విద్య శాశ్వతమైనది. ఇది ఇక్కడ ప్రారంభమవుతుంది, కానీ పరలోకం వరకు కొనసాగుతుంది" అని అగాటా పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ స్కూల్ వేగంగా అభివృద్ధి చెందుచున్నది , కానీ అక్కడ స్థలం పరిమితంగా ఉంది. మరింత మంది పిల్లలు ఈ క్రీస్తు–కేంద్రీకృత వాతావరణంలో విద్యను అభ్యసించేలా, అనేక తరగతి గదులు – ఇతర అవసరమైన సదుపాయాలతో కూడిన కొత్త విభాగాన్ని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మీరు "సమర్పించు 13వ సబ్బాతు కానుకలలో కొంత భాగం "కొంపాస్" స్కూల్ లో అదనపు తరగతుల నిర్మాణానికి ఉపయోగపడుతుంది. దేవుడు ఆరంభం నుండి ఎలాగైతే నడిపించారో, అలాగే ప్రార్థన, అంకితభావం కలిగిన విద్యావేత్తలు మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వాసులు ఇచ్చుచున్న ధారాళమైన కానుకల ద్వారా ఆయన తన నడిపింపును కొనసాగిస్తారని అగాటా దృఢంగా విశ్వసిస్తున్నారు.